క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవం అయిన దృశ్యం

పెనుగొండ: మండలంలోని వెంకటాయల చెరువు (దేవ) గ్రామానికి చెందిన సన్నమంద్ర మధురకు అంబులెన్స్‌లోనే ప్రసవమైంది. సోమవారం తెల్లవారు జామున ఆమెకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. 108లో ఆమెను ఆసుపత్రికి తీసుకెళుతుండగా నొప్పులు అధికమై ప్రసవమైంది. అనంతరం అనంతరం తల్లి బిడ్డను ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కొంబత్తుల జయరాజు పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రికి తరలించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



దివ్యాంగులకు బూట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: ఫెమీనా లయన్స్ క్లబ్ నరసాపురం శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని కళ్యాణి దివ్యాంగుల కేంద్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 30 మంది దివ్యాంగులకు బూట్లు, సాక్సులు వారి సంరక్షులకు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు చెన్నా లక్ష్మి మాట్లాడుతూ కళ్యాణి రిహేబిటేషన్ సెంటర్ గత కొన్నేళ్లుగా దివ్యాంగుల కోసం పనిచేస్తుందన్నారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సెంటర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో క్లబ్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. క్లబ్ సభ్యులు చవ్వాకుల భాను, చొదుల రమ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా గోదావరి రేవులు



వరద తగ్గడంతో బురదమయంగా మారిన వలంధర్‌రేవు

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి నీటిమట్టం సోమవారం సాధారణ స్థితికి చేరుకుంది. స్థానికంగా గోదావరి ప్రవాహ వేగం పూర్తిగా తగ్గింది. గోదావరి శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ పరిధిలో గోదావరి తీరం వెంబడి ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ముంపు పూర్తిగా తొలగింది. అయితే రేవులు అన్నీ బురదమయంగా మారాయి. వలంధర్‌రేవు వద్ద భక్తులు స్నానాలు చేయడానికి అనుమతి ఇచ్చారు. కానీ వలంధర్ రేవు నీరు తొలగడంతో బురదమయంగా మారింది. నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు కూడా అలాగే ఉన్నాయి. అమర్వేరఘాట్, లలితాంభ ఘాట్ వద్ద కూడా ఇదే పరిస్థితి.

ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పాయ్ 2.0 పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌డెక్స్ 2024-25 పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూర్యకుమారి మాట్లాడుతూ ప్రణాళికల ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఎంపీడీఓ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రణాళికలను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ వేత్త పెద్దిరాజుకు జాషువా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పెద్దిరాజు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన అంబేడ్కర్ సాహితీ వేత్త డాక్టర్ కోలాటి చిన పెద్దిరాజు గుర్రం జాషువా సాహిత్య పురస్కారం అందుకున్నారు. సోమవారం తిరుపతికి చెందిన ఉషోదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ధనాశి ఉషారాణి భీమవరంలో వైఎస్సార్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహించిన సాహితీ సమ్మేళనంలో ఈ పురస్కారం అందించారు.

అధ్వానంగా రహదారులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు
పట్టించుకోని పాలకులు



అధ్వానంగా ఉన్న మొగల్తూరు-వెంప రహదారి



కొత్తనవరసపురం రహదారి దుస్థితి ఇదీ

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా నియోజకవర్గంలోని రహదారుల సమస్య తీరలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మొగల్తూరు మండలంలోని మొగల్తూరు-వెంప రహదారి, కొత్తకాయల తిప్ప-పసలదీవి రహదారి, నరసాపురం మండలం కొత్త నవరసపురం-ఏనుగువాని లంక రహదారులు అధ్వాన స్థితికి చేరి నడిచేందుకు వీలు లేకుండా ఉన్నాయి. గడిచిన ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మోసపూరిత వాగ్దానాలు చేసి, అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు మరిచారని ప్రజలు విమర్శిస్తున్నారు. మొగల్తూరు-వెంప రహదారిని తక్షణమే నిర్మించాలని, లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమని అఖిల పక్ష నేతలు హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి మరచిపోయారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రహదారుల నిర్మాణం తక్షణమే చేపట్టకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని కొంతమంది చెబుతున్నారు.

తక్షణమే రోడ్డు నిర్మించాలి



మొగల్తూరు-వెంప రోడ్డును వెంటనే నిర్మించాలి. ఈ రోడ్డులో భారీ గుంతలు ఉండటంతో నడవడానికి ఇబ్బందిగా ఉంది. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. లేని పక్షంలో ఆందోళన చేపడతాం.

-కోనాల ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మొగల్తూరు

కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నవరసపురం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాం. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు పనులను అర్ధాంతరంగా నిలిపి వేసింది. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి ప్రజా సమస్యలు పరిష్కరించాలి.

-పులపర్తి త్రిమూర్తులు, పసలదీవి.

కూటమి ప్రభుత్వంలో అన్నదాత కుదేలు



పాలకొల్లు సెంట్రల్: అన్నదాత పోరు కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఇన్‌చార్జి గుడాల గోపి తదితరులు



పెనుగొండ: రైతన్నలకు అండగా అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



నరసాపురం: అన్నదాతపోరు పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలు కూటమి ప్రభుత్వంలో కుదేలయ్యారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ రైతులను ఆదుకోవలసిన అత్యవసర సమయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా పాలకొల్లులో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని పట్టణంలో ర్యాలీ నిర్వహించి నరసాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ శ్రీనివాసు, యినకొండ రవి, కర్రా జయసరిత, మద్దా చంద్రకళ, పెదపాటి పెద్దిరాజు, జోగి వెంకటేశ్వరరావు, జోగాడ ఉమామహేశ్వరరావు, వీరా ఉమాశంకర్, మామిడిశెట్టి చిట్టిబాబు, చాన్‌బాషా, ఉండ్రాజవరపు రవి, యాతం నానాజి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు అండగా అన్నదాత పోరు

పెనుగొండ: రైతన్నలకు అండగా అన్నదాత పోరు నిరసన కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని జిల్లా పరిషత్ ప్రతిపక్ష నేత గుంటూరి పెద్దిరాజు అన్నారు. ముందుగా అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 9:30 గంటలకు నరసాపురం ఆర్‌డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆందోళన కార్యక్రమం చేపట్టి, ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తామన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరవుతారని తెలిపారు. ఆచంట నియోజకవర్గంలోని, నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నరసాపురం బస్టాండ్ ఎదురుగా కాటన్ పార్కు వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ ఆఫీసుకు చేరుకోవాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి వేణుబాబు, ముప్పాల వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యనారాయణ, ముత్యాల నాగేశ్వరరావు, ఏనుగుపల్లి వరప్రసాద్, యల్లమెల్లి రాజేష్, పుచ్చకాయల నాగార్జున, బొక్కా రామకృష్ణ, తడాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు విజయవంతం చేయాలి

నరసాపురం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు కోరారు. సోమవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందలేదన్నారు. ఎరువులు దొరక్క, యూరియా బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శనగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తామని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమంలో నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి, మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్, నేతలు కావలి నాని, కడలి రాంబాబు, దొంగ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



అక్షరాస్యత దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వ్యక్తి చదువుకోవడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు టి.మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి చదువు ఎంత ముఖ్యమో ఈ అక్షరాస్యత ద్వారా తెలియపరిచామన్నారు. 1965 సెప్టెంబర్ 8వ తేదీన యునెస్కో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. 1966 నుంచి క్రమం తప్పకుండా అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. అలాగే అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హోంవర్క్ డైరీలు, క్రేయాన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, నందిని, లీలాకుమారి, పీఎంసీ చైర్మన్ కరణం పాపారావు, టి.రాజరాజేశ్వరి, బూసి వెంకటస్వామి, రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



నూతనంగా ఎన్నికైన మల్లవరం లంక వైఎస్సార్ సీపీ కమిటీ



పెనుగొండ నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ

నర్సాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి గ్రామ కమిటీలు చురుగ్గా పని చేయాలని నరసాపురం నియోజకవర్గ సమన్వయకర్త పీడీ రాజు అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల నియామకం చురుగ్గా సాగుతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా నిర్వహించకపోగా హామీలన్నీ నెరవేర్చామంటూ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఓ వైపు రైతులు, ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల వారిని చంద్రబాబు సర్కారు మోసం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను క్యాలెండర్ ఇచ్చి మరీ అమలు చేసిన ఘనత ఆయనదే అన్నారు. సోమవారం నరసాపురం మండలం మల్లవరం లంక గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్ అధ్యక్షతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మైలే వీరసింహ, ప్రధాన కార్యదర్శులుగా ఇంజేటి యాకోబు, తోట నాగేశ్వరరావు, గూడూరి కృష్ణారావు, కడలి శ్రీను, కార్యదర్శులుగా గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, దొడ్ల పండు, గొట్టుముక్కల మంగారావు, వేడంగి నరసింహారావు, కార్యవర్గ సభ్యులుగా గూడూరి గణేశ్వరరావు, గొట్టుముక్కల సుబ్రహ్మణ్యం, వేగి నరసింహులు, కొంభత్తుల ఇశ్రాయేలు, గొట్టుముక్కల గాంధీ, గూడూరి శంకరం, తణుకుల శ్రీను, మొరాల సురేష్, పాల సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు.

మల్లవరం లంక గ్రామ విభాగాల అధ్యక్షులు వీరే..

యూత్ గ్రామ అధ్యక్షులు తణుకుల రాజబాబు, రైతు విభాగం గ్రామ అధ్యక్షుడు గుబ్బల రామ సత్యనారాయణ, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు తోట చిట్టిబాబు, బీసీ సెల్ గ్రామ అధ్యక్షులు కౌరు నాగేశ్వరరావు, మహిళా గ్రామ అధ్యక్షురాలు కానేటి విజయలక్ష్మి, మేధావుల ఫోరం అధ్యక్షులు మద్దిశెట్టి నాగేశ్వరరావు, సోషల్ మీడియా అధ్యక్షులు వర్దనపు రవి లు ఎంపికయ్యారు. వీరిని ఎంపీపీ మహిళా బత్తుల సోనీ, సర్పంచులు గొట్టుముక్కల సుజాత, దొండపాటి వెంకట్ తదితరులు అభినందించారు.

సాంకేతికతతో వ్యవసాయం సులభతరం



ద్రావణాన్ని డ్రోన్‌లో వేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: రైతులు టెక్నాలజీని ఉపయోగిస్తే వ్యవసాయం సులభతరమవుతుందని వ్యవసాయ శాఖ డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు అన్నారు. సోమవారం మండలంలో చింతపర్రు, వడ్లవానిపాలెంలో వ్యవసాయంలో డ్రోన్ల ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానంలో ద్రావణాన్ని డ్రోన్ల ద్వారా పిచికారీ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో స్ప్రే చేయొచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాలను రైతుల ముందు కలిపి స్ప్రే చేయించారు. 12 రకాల పోషకాలు, ఆరు రకాల ఫంగస్‌లు, పాల ఇంగువ, కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం కలిపి స్ప్రే చేయించారు. ఇలా 12 రకాల పోషకాలు భూమికి పోషకాలు అందిస్తుందని, పంగస్సులు, పాలింగువా పురుగులు, తెగుళ్లను కంట్రోల్ చేస్తుందని రైతులకు వివరించారు. ఐసీఆర్‌పీ ఆదిరత్న సూర్య కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న డివిజన్ ఉప వైద్యాధికారి

యలమంచిలి: ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నరసాపురం డివిజన్ ఉప వైద్యాధికారి ప్రసాదరావు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.అశ్విని, పి.నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన చేనేత కార్మికులకు రూ.25 వేల సహాయం హామీని అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం దగ్గులూరులో బళ్ల చిన వీరభద్రరావు అధ్యక్షతన ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికుడికి ఉప వృత్తుల వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు, వృత్తి పరిరక్షణకు ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. చేనేత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమతం సముద్ర లింగం, గుడిమెట్ల సుబ్బారావు, బూడిద జోగేశ్వరరావు, చల్లా వీరభద్రుడు, అక్కింశెట్టి నాగయ్య, ఉయ్యూరు చంద్ర, వాసా ప్రదీప్, రామవీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఎస్ఎస్ఎం జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో అక్షరాస్యులు కాకపోయినా డిజిటల్ రంగంలో టెక్నాలజీని ఉపయోగిస్తున్న వారు చాలా మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా శోభారాణి, రవి శంకర్, నోబుల్ రాజు, మహాలక్ష్మి, జ్యోత్న రాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

యలమంచిలి: పోడూరు మండలం జున్నూరు గ్రామానికి చెందిన కిలారి శ్రీనివాస్ (39) ఈ నెల 7వ తేదీ నుంచి కనపడడం లేదని అతడి సోదరుడు కిలారి మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. శ్రీనివాస్ ఉల్లంపర్రులోని ఒక ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ ఉదయం రాజోలులో స్నేహితుల ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్వానంగా పంట కాలువ



చినమామిడిపల్లి వద్ద చెత్తతో నిండిపోయిన పంట కాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి-సరిపల్లి నుంచి వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంట కాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్త పేరుకుపోయింది. అసలు ఇది పంట కాలువా అన్న రీతిలో తూడు పెరిగిపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 1500 ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడిక్కక్కడ చెత్త పేరుకుపోవడంతో నీరు పారడం లేదు. శివారు ప్రాంతాలకు అసలు నీరు చేరడం లేదు. వేసవిలో కాలువలు కట్టేసినప్పుడు, ఇప్పుడు నీరు వదిలి నెలలు దాటుతున్నా కాలువను శుభ్రం చేయలేదు. ఇప్పటికైనా కాలువ బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్‌లో ఏడు కేసుల నమోదు

భీమవరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నాలుగు అనధికార మద్యం విక్రయ కేసులు, బహిరంగంగా మద్యం సేవిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహించినా, బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించినా చర్యలు తప్పవన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

పెనుగొండ: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన గ్రామ కమిటీలు పని చేయాలని జిల్లా పరిషత్ ప్రతిపక్ష నేత, పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు అన్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత సుంకర సీతారామ్ అధ్యక్షతన కొడమంచిలిలో నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మాటే నాయకులకు, కార్యకర్తలకు శిరోధార్యమని అధినేత ఆదేశాలు పాటించడమే కార్యకర్తల లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జాయింట్ కార్యదర్శి పాస్టర్ బి.డేవిడ్ రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి వేణుబాబు, ముప్పాల వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, కోట వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యనారాయణ, కోటే శశి మధు, యల్లమెల్లి బేబీ రాజేష్, బొక్కా రామకృష్ణ, ఏనుగపల్లి వర ప్రసాద్, మన్నె సుబ్బారావు, గున్నాబత్తుల వెంకటాచారి, కొండేటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొడమంచిలి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నిమ్మితి వేణుబాబు, ప్రధాన కార్యదర్శిగా వెంకటాచారి, ఉపాధ్యక్షుడిగా జక్కంశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు కమిటీని ఎన్నుకున్నారు.